

తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1,578.36	1,576.13
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	000	000
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	169	258
సామర్థ్యం (టీఎంసీలు)	3.73	2.87

అమెరికా నుంచి వచ్చి ఓటు వేసిన దావణగెర వాసులు



ఓటు వేసిన రాఘవేంద్ర కమలకర్ శేఠ్ కుటుంబం

బళ్లారి గాంధీనగర్, మే 7:దేశ ప్రజాప్రభుత్వ వ్యవస్థ ఏర్పాటులో ఓటు హక్కు ప్రాధాన్యతను తెలుసుకున్న ఎంతోమంది విదేశాల్లో స్థిరపడినా... ఈ సారి జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో వారి వారి ప్రాంతాలకు వచ్చి ఓటు హక్కు వినియోగించుకున్నారు. రాష్ట్రంలో రెండో దశలో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో చాలామంది ఓటర్లు విదేశాల నుంచి వచ్చి ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈ నేపథ్యంలోనే దావణగెర నగరానికి చెందిన రాఘవేంద్ర కమలకర్ శేఠ్ కుటుంబం అమెరికాలో స్థిరపడింది. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో వారంతా కుటుంబ సమేతంగా సొంతూరు దావణగెరకు చేరుకుని ఓటు హక్కు వినియోగించుకున్నారు. అందరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని హితవు పలికారు. అదేవిధంగా అభిషేక్ అనే వ్యక్తి లండన్ నుండి వచ్చి దావణగెరలో ఓటు హక్కు వినియోగించుకొన్నాడు.

ఓటుహక్కు వినియోగించుకున్న హిజ్రాలు



ఓటు వేసినట్లు వేలిగుర్తును చూపుతున్న హిజ్రాలు...

బళ్లారి గాంధీనగర్, మే 7: లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా మంగళవారం దావణగెర నగరంలోని 137 నెంబరు పోలింగ్ కేంద్రంలో హిజ్రాలు ఓటు వేసి ప్రజా ప్రభుత్వ వ్యవస్థలో తమదైన బాధ్యతను తెలియజెప్పారు. రాష్ట్రంలో రెండోవిడతలో జరుగుతున్న లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా నిట్టువళ్లి ప్రాంతంలో ఏర్పాటు చేసిన 137 పోలింగ్ కేంద్రంలో ఏడుగురు హిజ్రాలు ఓటువేశారు. వీరిలో స్పందన, దీక్ష, గొంబె, రశ్మికా, సించన, నందనమ్మ, జాహ్నవి తదితరులున్నారు. నగరంలో ఏర్పాటు చేసిన సఖి ప్రత్యేక పోలింగ్ కేంద్రంలో వీరంతా ఓటు వేయడంతో పాటు అనంతరం ప్రతి ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు.

ఓటింగ్‌లో శతాధిక వృద్ధురాలు



గంగోత్రి పాఠశాలలో ఓటు వేసిన వృద్ధురాలు

బళ్లారి గాంధీనగర్, మే 7: లోక్‌సభ ఎన్నికల్లో యువతకు దీటుగా... వయస్సు మళ్ళిన వారు ఉత్సాహంగా ఓటు హక్కు వనియోగించుకున్నారు. బళ్లారి నగరంలోని సత్యహరిశ్చంద్ర నగర్ గంగోత్రి పాఠశాలలో ఏర్పాటు చేసిన 54వ పోలింగ్ కేంద్రంలో నూరేళ్ళు నిండిన గోవిందమ్మ అనే వృద్ధురాలు ఓటు హక్కు వినియోగించుకుంది. పోలింగ్ కేంద్రానికి సహాయకులతో వచ్చిన ఆమెకు స్థానిక పోలింగ్ కేంద్రం అధికారులు, సిబ్బంది సహకరించారు.

బ్యాలెట్ నిబంధన బేఖాతర్

బళ్లారి సిటీ, మే 7: లోక్‌సభ ఎన్నికల్లో మంగళవారం కార్పొరేటర్ కోనంకి తిలక్ ఓటు వేసి నిబంధనలను ఉల్లంఘించారు. బళ్లారి వార్డు నంబర్ 35లో 63వ పోలింగ్ బూత్‌లో ఓటు వేసిన ఆయన రహస్య బ్యాలెట్ నిబంధనను ఉల్లంఘించారు. బీజేపీకి ఓటు వేసిన తిలక్ ఆ ఫోటో తీసి తన వాట్సప్ స్టేటస్‌లో పెట్టాడు. తిలక్ బళ్లారి కార్పొరేషన్‌లో 10వ వార్డు సభ్యుడు కావడం గమనార్హం.

ఓటు హక్కు వినియోగించుకున్న బళ్కారి డిసీ మిశ్రా



బళ్లారి గాంధీనగర్, మే 7: లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా మంగళవారం స్థానిక సతీశ్‌చంద్ర అగర్‌వాల్ డిగ్రీ కళాశాలలో బళ్కారి డిసీ.ప్రశాంత్‌కుమార్ మిశ్రా ఓటు హక్కు వినియోగించుకున్నారు. ప్రజాప్రభుత్వం పండుగలో భాగంగా ఓటు వేసినట్లు తెలిపారు. జిల్లాలో ప్రతి ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు.



ఓటు వేసి వచ్చిన నారా సూర్యనారాయణరెడ్డి



ఓటు వేసిన గాలి జనార్దన్‌రెడ్డి భార్య లక్ష్మిఅరుణ

పోలింగ్ ప్రశాంతం

- 73.59 శాతం ఓటింగ్ నమోదు
- మహిళా ఓటర్లే అధికం
- బళ్లారి జిల్లా కొళగల్లు గ్రామంలో ఎన్నికల బహిష్కరణ, సర్దుబాటు
- విజయనగరలో పదిచోట్ల సాంకేతిక సమస్య



సండూరులో ఓటు హక్కును వినియోగించుకున్న ఎంపీ అభ్యర్థి తుకారామ్



బీజేపీ అభ్యర్థి బి. శ్రీరాములు కుటుంబంతో కలిసి ఓటింగ్‌లో పాల్గొన్న దృశ్యం



కుటుంబంతో కలిసి ఓటు వేసిన మంత్రి నాగేంద్ర, నారా భరత్‌రెడ్డి

బళ్లారి, మే7 (ఆంధ్రజ్యోతి): చెదురు మదురు సంఘటనలు మినహా బళ్లారి జిల్లాలో లోక్‌సభ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. పోలింగ్ తొలిగంటల్లో ప్రశాంతంగా ప్రారంభమైనా ఒకదశలో మందగించి చివరికి పుంజుకుంది. ఉదయం 7 గంటలకే పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు బారులు తీరారు. కొన్ని పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు కిక్కిరిసి ఉండగా మరికొన్ని కేంద్రాలు ఓటర్లే లేక బోసిపోయాయి. పోలింగ్ కేంద్రాలకు ఓటువేసేందుకు వచ్చే వారు ఎటువంటి ఇబ్బంది పడకుండా ఉండేందుకు ఎన్నికల అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. తొలిగంటలో అంటే 7 నుండి 9 గంటలకు ఓటింగ్ పెద్దగా కనిపించలేదు, 10 శాతమే పోలింగ్ జరిగింది. 11 గంటలకు 26.45 శాతం ఓట్లు పోల్ అయ్యాయి. సాయంత్రం 6 గంటలకు అధికార గణాంకాల ప్రకారం 73.56 శాతం ఓటింగ్ జరిగింది. రాత్రి 9 గంటలు దాటుతున్నా ఇంకా కొన్ని చోట్ల పోలింగ్ సాగింది.

బళ్లారి జిల్లా కొళగల్లు గ్రామంలో తొలుత ఓటర్లు ఓటు వేయకుండా బహిష్కరించారు. ఎన్నికల అధికారి సమస్యలను పరిష్కరిస్తామని సర్దిచెప్పడంతో వారు ఓటింగ్‌లో పాల్గొన్నారు.

బళ్లారి లోక్‌సభ పరిధిలో 18,84,040 మంది ఓటర్లు ఉండగా, వీరిలో మహిళలు 9,54,914 మంది, పురుషులు 9,28,878 మంది ఇతరులు 269 మంది ఉన్నారు.

ఈ ఎన్నికల్లో ఎక్కువ శాతం మహిళలు ఓటు హక్కుకు వినియోగించుకున్నారు.

ఉదయమే పోలింగ్ కేంద్రాల వద్దకు కుటుంబ సమేతంగా వచ్చి నాయకులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. బీజేపీ లోక్‌సభ అభ్యర్థి బి. శ్రీరాములు తన కుటుంబసమేతంగా వచ్చి ఓటు వేశారు. మంత్రి నాగేంద్ర, ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి వారి వారి కుటుంబాలతో వచ్చి ఓటు వేశారు. అలాగే కాంగ్రెస్ అభ్యర్థి ఇ. తుకారాం సండూరులో కుటుంబంతో కలిసి ఓటు వేశారు. మిగిలిన మంత్రులు ఎమ్మెల్యేలు కూడా వారి వారి ఏరియాల్లో ఓటింగ్‌లో పాల్గొన్నారు. ఎండలను దృష్టిలో ఉంచుకుని నాయకులు అంతా ఉదయమే ఓటింగ్‌లో పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువ మంది మహిళలు ఓటింగ్‌లో పాల్గొన్నారు. వికలాంగులు, వృద్ధులు, యువకులు కూడా పెద్దఎత్తున ఓటింగ్‌లో పాల్గొన్నారు.మొత్తం మీద ఈసారి ఎన్నికల్లో 73.59 శాతం ఓటింగ్ నమోదయింది.

విజయనగరంలో పదిచోట్ల సాంకేతిక సమస్యలు

బళ్లారి సిటీ, మే 7: బళ్లారి లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని విజయనగరం జిల్లాలో మంగళవారం ఓటింగ్ ప్రశాంతంగా ప్రారంభమైంది. 10 పోలింగ్ కేంద్రాల్లో మాత్రం సాంకేతిక సమస్యలతో ఓటింగ్‌లో జాప్యం జరిగింది. హొసపేట ప్రభుత్వ బాలికల అండర్‌గ్రాడ్యుయేట్ కళాశాలతో పాటు 10 పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ యంత్రాల్లో సాంకేతిక లోపం తలెత్తింది. సిబ్బంది సకాలంలో స్పందించి మరమ్మతులు చేయడంతో ఆ కేంద్రాల్లో పోలింగ్ ఆలస్యంగా ప్రారంభమైంది.

విజయనగరం జిల్లా హొస్పేట్‌లో ఎమ్మెల్యే హెచ్‌ఆర్ గవియప్ప తన సతీమణి పుణ్యమూర్తితో కలిసి ప్రభుత్వ పాఠశాలలో కలిసి ఓటు వేశారు. ప్రభుత్వ బాలికల పాఠశాలలో మాజీ ఎమ్మెల్యే ఆనంద్‌సింగ్, తల్లి,భార్య, కుమారుడు సిద్ధార్థ్‌సింగ్‌తో కలిసి ఓటు వేశారు. ఉదయం నుంచే వివిధ పోలింగ్ బూత్ ప్రాంగణాల్లో ఓటర్లు వరుసల్లో నిలబడి పోలింగ్‌లో పాల్గొన్నారు. సంప్రదాయ పోలింగ్ బూత్‌లు, సఖిపోలింగ్ బూత్‌లలో ప్రశాంతంగా ఓటింగ్ జరిగింది.

ఎన్నికల వేళ.. పలువురికి అస్వస్థత



ఓటు హక్కును వినియోగించుకున్న మాజీ మంత్రి ఆనంద్‌సింగ్

బళ్లారి గాంధీనగర్, మే 7: లోక్‌సభ ఎన్నికలు జరుగుతున్న సమయంలో మంగళవారం ఎన్నికల విధుల నిర్వహణలో ఉన్న పలువురు సిబ్బంది అస్వస్థతకు గురయ్యారు. వెంటనే ఆరోగ్య సిబ్బంది వారిని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందజేశారు. బళ్కారి జిల్లాలో ఒకవైపు ఎన్నికల వేడి ... మరో వైపు సూర్యుడి ఎండవేడిమి మధ్య ఎన్నికలు జరుగుతుండగా..... పోలింగ్ కేంద్రాలకు వచ్చే ఓటర్లకు నిట్టూర్పే పరిస్థితి నెలకొంది. ఎన్నికల విధుల్లో భాగంగా జిల్లాలో వివిధ పోలింగ్ కేంద్రాలకు వెళ్ళిన అధికార, సిబ్బంది కూడా ఎండవేడిమికి తట్టుకోలే అస్వస్థతకు గురయ్యారు. జిల్లా పరిధిలోని కుడితిని గ్రామంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో ఎన్నికల విధుల్లో ఉన్న రవిచంద్ర అనే వ్యక్తి తీవ్ర రక్తపోటుకు గురై అస్వస్థతకు గురయ్యాడు. వెంటనే అతడిని అంబులెన్స్‌లో సముదాయ ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అదేవిధంగా బళ్లారి తాలూకా పరిధిలోని కొళగల్లు గ్రామంలో ఎన్నికల విధుల్లో ఉన్న లక్ష్మీదేవి కూడా అస్వస్థతకు గురికాగా ఆమెను కూడా ఆసుపత్రికి తరలించి చికిత్స అందజేశారు.



అస్వస్థతకు గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఎన్నికల సిబ్బంది

బళ్కారి నగర పరిధిలో బండి హట్టి ప్రాంతంలో ప్రభుత్వ పాఠశాల (గోడేవాల)లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో అధికారి శోభారాణి అస్వస్థతకు గురయ్యారు. ఆమెను కూడ బండిహట్టి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వైద్య చికిత్స అందజేశారు.



కుడితినిలో ఓటు హక్కు వినియోగించుకున్న కాంగ్రెస్ నాయకులు వి. రాజశేఖర్



ఓటు వేసిన మాజీ ఎమ్మెల్యే గాలి సోమశేఖర్‌రెడ్డి



ఓటు వేసిన ఎమ్మెల్యే బీఎం నాగరాజు



ఓటు వేసిన ఎమ్మెల్యే జేఎన్‌గణేష్ దంపతులు

హోసూరు జోన్

అన్నాడీఎంకే తరపున చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రం ప్రారంభంలో పాల్గొన్న అన్నాడీఎంకే మాజీ మంత్రి బాలకృష్ణారెడ్డి


హోసూరు మే 7 ఎండాకాలం ప్రారంభమైనప్పటి నుంచి హోసూరు ప్రాంతంలో ఎండ వేడిమి మండుతోంది. వేడి వాతావరణంలో ప్రజల దాహార్తిని తీర్చడానికి అన్నాడీఎంకే పార్టీ తరఫున ప్రతిరోజూ హోసూరు బస్‌స్టాండ్ ప్రాంతంలో చలివేంద్రం ప్రారంభించి పానీయాలు , పండ్లు, నీరు మజ్జిగ అని బాటసారులకు అందిస్తూవస్తున్నారు. ముఖ్య అతిథులుగా అన్నాడీఎంకే మాజీ మంత్రి బాలకృష్ణారెడ్డి హాజరై ప్రజలకు నీరు , నిమ్మరసం, పుచ్చకాయ, కీరదోస, అరటిపండ్లు, తదితర పండ్లను పంపిణీ చేశారు. బస్టాండుకు వస్తున్న ప్రజలకు తరచూ అందిస్తున్నారు. పెద్ద సంఖ్యలో ప్రజలు వస్తు పోతుఉంటారు. ఈ కార్యక్రమంలో వాసుదేవన్, రాజు, మంజునాథ్, పాల్గొన్నారు. నారాయణన్, పాల్గొన్నారు.

తేనెటీగల దాడిలో ఒకరి మృతి

హోసూరు మే 7 హోసూరు గిరిసెట్టిపల్లి గ్రామానికి చెందిన గోపాల్(39) దుకాణాలకు మసాలాల పాకెట్లు విక్రయిస్తుంటారు. మంగళవారం ఉదయం గోపాల్ కెలమంగలం రాయకోట రోడ్డులోని కొత్తూరు సమీపంలో ఓ ప్రాంతానికి వెళ్లాడు. ఆ సమయంలో ఒక మాను దగ్గర నిలిచి ఉండగా అకస్మాతుగా తేనెటీగలు వెంబడించి చుట్టుముట్టాయి. దానిని చెదరగొట్టేందుకు ఎంత ప్రయత్నించినా వీలుకాకపోవడంతో గోపాల్ తీవ్రంగా గాయపడ్డాడు. ఆసుపత్రి తరలించగా చికిత్స పొందుతూ గోపాలప్ప మృతి చెందాడు.

రాయచూరు ప్రజలు కాంగ్రెస్‌కే అనుకూలం

- కాంగ్రెస్ అభ్యర్థి కుమార్ నాయక్



రాయచూరు, మే 7 : లోకసభ ఎన్నికల పోలింగ్‌లో ప్రజలు ఉత్సహంగా ఓటు హక్కును వినియోగించుకున్నారని కాంగ్రెస్ పార్టీ పట్ల ప్రజల్లో ఉన్న విశ్వాసానికి ఇది ప్రతీక అని ఆ పార్టీ లోకసభ అభ్యర్థి జీ కుమార్ నాయక్ అన్నారు నగరంలోని కేఈబీ పాఠశాల పోలింగ్ బూత్ వద్ద విలేఖరులతో మాట్లాడిన కుమార్ నాయక్ ఓటింగ్ శాతం గణనీయంగా ఉన్న నేపధ్యంలో ప్రజలకు కాంగ్రెస్ పాలనపట్ల నమ్మకం ఉన్నట్లు తాము భావిస్తున్నామన్నారు. ప్రజలు ఉదయం నుంచి సాయంత్రం వరకు అధిక సంఖ్యలో ఓటు హక్కు వినియోగించుకోవడం వల్ల తమ గెలుపు ఖాయమని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. అదే సమయంలో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామిలను అమలు చేస్తున్న నేపధ్యంలో ప్రజలకు పార్టీ పట్ల ప్రభుత్వం పట్ల నమ్మకం కుదిరిందన్నారు. దీనికి తోడు కేంద్ర నాయకత్వం ఐదు న్యాయ పేరుతో ఇచ్చిన హామిల పట్ల సానుకూలంగా స్పందిస్తున్నట్లు కుమార్ నాయక్ తెలిపారు.

గతం కంటే ఎక్కువ ఓట్ల మెజార్టీ వస్తుంది

బీజేపీ అభ్యర్థి అమరేశ్వర్ నాయక్



కుటుంబంతో కలిసి ఓటు వేసిన బీజేపీ అభ్యర్థి అమరేశ్వర్ నాయక్

రాయచూరు, మే 7: ఉత్సహంగా ఓటింగ్‌లో పాల్గొంటున్న ఓటర్లను గమనిస్తే తమ పార్టీ గతంలోకంటే ఎక్కువ మెజార్టీ ఓట్లతో గెలుపొందడం ఖాయమని బీజేపీ అభ్యర్థి, సిట్టింగ్ ఎంపీ రాజా అమరేశ్వర్ నాయక్ విశ్వాసం వ్యక్తం చేశారు. మంగళవారం జిల్లాలోని లింగసుగూరు తాలూకా గురుగుంటా గ్రామంలోని 16వ పోలింగ్ బూత్‌లో కుటుంబంతో కలిసి ఓటు హక్కు వినియోగించుకున్నారు. అనంతరం విలేఖరులతో మాట్లాడిన రాజా అమరేశ్వర్ నాయక్, గడచిన ఐదు ఏళ్లలో తాను నియోజక వర్గంలో పలు రైల్వే జాతీయ రహదారి పనులతో పాటు రూ.30 వేల రోట్లకు పైగా అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టానన్నారు.

కంప్లిలో పోలింగ్ ప్రశాంతం

కంప్లి, మే 7 : కంప్లి నియోజకవర్గంలోని కంప్లి, కురుగోడు, బళ్లారి తాలుకాలో 242 పోలింగ్ కేంద్రాలలో ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. మండుటెండలను సైతం లెక్కచేయకుండా ఎన్నికల్లో ఓటు వేసేందుకు ఓటర్లు వచ్చారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఉదయం నుండి సాయంత్రం 6 గంటల వరకు ఈసారి పోలింగ్ శాతం 78.91 శాతం పోలింగ్ జరిగింది. ఉదయం కురుగోడులో ఎమ్మెల్యే జేఎన్ గణేష్ దంపతులు తమ ఓటును వినియోగించుకున్నారు. అలాగే కుడితిని పట్టణంలో వి రాజశేఖర్‌తో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు ఓటును వినియోగించుకున్నారు. కుడితిని పట్టణంలో ఎన్నికల్లో 12959 ఓట్లు వుండగా 9675 ఓట్లు పోలయ్యాయి. 75 శాతం పోలింగ్ జరిగినట్లు తెలిపారు. అధికారులు కూడా ఎలాంటి బూత్‌ల వద్ద సమస్యలు తలెత్తకుండా విధులు నిర్వహించారు. కొన్ని చోట్ల రక్త బలహీనత వల్ల కుప్పకూలారు. వెంటనే వారిని ఆస్పత్రికి తరలించారు.

కొప్పళ్‌లో 65 శాతం

సిరుగుప్ప, మే 7 : ప్రశాంతంగా కొప్పాళ లోక్‌సభ పరిధిలో సిరుగుప్ప తాలుకాలో 65 శాతం పోలింగ్ జరిగినట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా తాలుకాలో 228 పోలింగ్ కేంద్రాలలో ఓటర్లు ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఓటు హక్కును వినియోగించుకున్నారు. స్థానిక ఎమ్మెల్యే బీఎం నాగరాజు, కుటుంబ సభ్యులు 104వ బూత్ కేంద్రంలో ఓటు హక్కును వినియోగించుకున్నారు. అన్ని చోట్ల వరుసగా నిలబడి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

ఐసీఎస్ఈ పదో తరగతి పరీక్ష ఫలితాల్లో బెస్ట్ విజయకేతనం



ఆర్యారావు సాయిమాధవ హర్షిత పటిల్ ప్రియాంక రేవంత్ ఖేతన

బళ్లారి సిటీ, మే 7: ఐసీఎస్ఈ బోర్డు విడుదల చేసిన పదోతరగతి ఫలితాల్లో బళ్లారి బెస్ట్ పాఠశాల విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించినట్లు పాఠశాల ప్రధానాచార్యుడులోకన్న మైలాపూర్ తెలిపారు. మొత్తం 135మంది విద్యార్థులకు 67మంది విద్యార్థులు ఉన్నత శ్రేణిలో, 50మంది ప్రథమశ్రేణిలో, 13మంది ద్వితీయ శ్రేణిలో, ఐదుగురు తృతీయ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించారని పేర్కొన్నారు.. రేవంత్ 484/500 మార్కులు సాధించి పాఠశాల టాపర్‌గా నిలిచారన్నారు. ఖేతన 478మార్కులు, సాయిమాదవ 471, హర్షిత పటిల్470, ఆర్యారావు 469, ప్రియాంక 468,సురేఖ 466, మేఘనరెడ్డి 462, శ్రీరేఖ రెడ్డి459, దినేశ్‌రెడ్డి 448, బందారు కుముద 448 మార్కులు సాధించారన్నారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను కళాశాల ఛైర్మన్ కోనంకి రామప్ప, ఉపాధ్యక్షుడు కోనంకి తిలక్ కుమార్,కార్యదర్శి మన్నెం శ్రీనివాసులు అభినందించారు.



రోడ్‌షోలో నందమూరి వసుంధరాదేవి, లోకేశ్వరి, కుమారుడు శ్రీనివాసులు

సకుటుంబ సమేతం..

హిందూపురం, మే 7 : ఎన్నికల్లో గెలవడం కోసం ఓ వైపు అభ్యర్థులు ప్రచారం చేస్తుంటే.. మరోవైపు వారి కుటుంబ సభ్యులు, బంధువులు, అనుచరులు కూడా దూసుకుపోతున్నారు. హిందూపురం నియోజకవర్గంలో ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ తరుపున ఆయన భార్య వసుంధరదేవి, కుమార్తెలు నారా బ్రాహ్మిణి, తేజశ్విని, నందమూరి బాలకృష్ణ సోదరి లోకేశ్వరి, కుమారుడు శ్రీనివాసులు, వసుంధర సోదరుడు ప్రసాద్ ఎన్నికల ప్రచారంలో నిమగ్నమయ్యారు. స్వర్ణాంధ్ర సహకార యాత్రలో భాగంగా నియోజకవర్గాల్లో నందమూరి బాలకృష్ణ పాల్గొంటుండగా ఇక్కడ వసుంధరదేవితోపాటు కుటుంబసభ్యులు, బంధువులు ప్రచారం నిర్వహిస్తున్నారు. వైసీపీ అభ్యర్థి దీపికతోపాటు ఆమె భర్త, బంధువులు, ప్రచారంలో పాల్గొంటున్నారు. పెనుకొండ నియోజకవర్గంలో టీడీపీ అభ్యర్థి సవిత ఓవైపు ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతుండగా ఆమె భర్త వెంకటేశ్వర్లు మరోవైపు మండలాలను చుట్టేస్తున్నారు. వారి బంధువులుకూడా ప్రచారంలో పాల్గొంటున్నారు. వైసీపీ అభ్యర్థి ఉషశ్రీచరణ్‌తోపాటు ఆమె భర్త చరణ్‌రెడ్డి, బంధువులు కూడా ప్రచారంలో నిమగ్నమయ్యారు. హిందూపురం లోక్‌సభ టీడీపీ అభ్యర్థి బీకే పార్థసారథి, సతీమణి, కుమారుడు, బంధువులు ప్రచారంలో పాల్గొంటున్నారు. పుట్టపర్తి నియోజకవర్గంలో టీడీపీ అభ్యర్థి పల్లె సింధూర ప్రచారంలో ముందుకెళ్తుండగా ఆమె మామ పల్లె రఘునాథ్‌రెడ్డి, భర్త పల్లె కృష్ణకిషోర్ కూడా ప్రచారంలో పాల్గొంటున్నారు. ఇక్కడ కూడా వైసీపీ అభ్యర్థి దుద్దేకుంట శ్రీధర్‌రెడ్డితోపాటు సతీమణి, కుటుంబ సభ్యులు ప్రచారంలో పాల్గొంటున్నారు. కదిరిలో తెలుగుదేశం అభ్యర్థి కందికుంట వెంకటప్రసాద్, ఆయన సతీమణి యశోదాదేవి ప్రచారంలో దూసుకెళ్తున్నారు.




ఎన్నికల సభలో మాట్లాడుతున్న బాలకృష్ణ కూతురు తేజశ్విని


అన్నదమ్ముల సవాల్..!

వైసీపీ నుంచి విశ్వ, కాంగ్రెస్ తరపున మధు

ఉరవకొండలో ఆసక్తికర రాజకీయం



మధుసూదన్‌రెడ్డి




విశ్వేశ్వరరెడ్డి

ఉరవకొండ: ఉరవకొండ శాసనసభ నియోజకవర్గ ఎన్నికల పోరు ఆసక్తికరంగా మారింది. గత ఎన్నికల్లో కలసిమెలసి ప్రచారం చేసిన అన్నదమ్ములు ఈ ఎన్నికల్లో బద్ధ శత్రువులయ్యారు. వైసీపీ అభ్యర్థిగా విశ్వేశ్వరరెడ్డి బరిలో ఉండగా, కాంగ్రెస్ పార్టీ తరపున విశ్వ సోదరుడు మధుసూదన్‌రెడ్డి పోటీలో నిలిచారు. 2004 నుంచి విశ్వేశ్వరరెడ్డికి చేదోడు వాదోడుగా ఉన్న మధు ఈ ఎన్నికల్లో అన్నకు ప్రత్యర్థిగా మారారు. కాంగ్రెస్ నుంచి పోటీచేసి గెలవాలని కాకుడా, తన సోదరుడిని ఓడించాలన్న లక్ష్యంతో మధుసూదన్‌రెడ్డి బరిలో నిలవడం గమనార్హం. అన్నదమ్ములిద్దరికీ పొసగకపోవడంతో మూడేళ్లుగా విరోధులుగా మారారు. ఈ నేపథ్యంలో గత సంవత్సరం వైసీపీ కార్యకర్తల సమావేశంలో విశ్వేశ్వరరెడ్డిపై మధు విమర్శలు చేయడంతో అతడిని పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. స్తబ్ధతగా ఉన్న మధు అన్నపై కక్షతో పీసీసీ చీఫ్ షర్మిల సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. అన్నదమ్ములిద్దరూ వేర్వేరు పార్టీలు తరఫున పోటీ పడుతుండడటంతో ఈ ఎన్నికల్లో టీడీపీకి కలిసి వస్తుందన్న చర్చ సాగుతోంది. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వైసీపీ ఓట్లు చీలుస్తారని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఇదిలా ఉండగా శాసనమండలి సభ్యుడు శివరామిరెడ్డి కూడా వైసీపీ తరఫున ప్రచారం చేయడంలేదు. ఆయనతో పాటు ఆయన వర్గీయులు కూడా నియోజకవర్గంలో ఎక్కడా ఎన్నికల ప్రచారంలో పాల్గొనకపోవడం గమనార్హం. ఆయన వర్గీయులు శివరామిరెడ్డి సోదరుడు వెంకట్రామిరెడ్డి పోటీ చేస్తున్న గుంతకల్లు నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నారు. ఉరవకొండ మేజర్ పంచాయతీలో వైసీపీకి గట్టి ఎదురు దెబ్బ తగిలింది. ఆ పార్టీ వార్డు మద్ధతుదారులు ఐదుగురు టీడీపీలోకి చేరారు. ఉరవకొండలో మరికొంత మంది వైసీపీ అసమ్మతి నాయకులు టీడీపీ గూటికి చేరే అవకాశాలు ఉన్నాయని చర్చసాగుతోంది. ఎన్నికల్లో టీడీపీ, వైసీపీ, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు పోటీ ఉండడటంతో ఎన్నికలు రసవత్తరంగా మారాయి. గత ఎన్నికల ఫలితాలను గమనిస్తే అతి తక్కువ ఓట్ల తేడాతోనే ఎమ్మెల్యేగా గెలుపు సాధిస్తున్నారు. ఈ నేపథ్యంలో వైసీపీలో శివరామిరెడ్డి వర్గం విశ్వకు ముఖం చాటేయడం, సొంత సోదరుడు మధు కాంగ్రెస్ నుంచి పోటీలో ఉండడం తదితర కారణాలతో ఈసారి టీడీపీ విజయం తథ్యమన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

రసవత్తరంగా ధర్మవరం పోరు



ధర్మవరం పట్టణ ముఖచిత్రం



ధర్మవరం

ఇసుక, మట్టి, భూకబ్జాలపై జనాగ్రహం

మార్పు కోరుకుంటున్న ప్రజలు

ఎమ్మెల్యే కేతిరెడ్డి తీరుపై విమర్శలు

సత్యకుమార్‌యాదవ్, కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి మధ్యే పోటీ



ధర్మవరం నియోజకవర్గంలో ఈసారి పోటీ రసవత్తరంగా మారింది. కూటమి బీజేపీ అభ్యర్థి సత్యకుమార్‌యాదవ్, వైసీపీ అభ్యర్థి కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి ప్రధానంగా పోటీలో ఉన్నారు. వీరిద్దరి మధ్య పోటాపోటీ నెలకొంది. ధర్మవరం నియోజకవర్గం 1952లో ఏర్పడింది. అప్పటి నుంచి 15సార్లు ఎన్నికలు జరిగాయి. ఇందులో 1983, 1985, 1989, 1994, 2004, 2014లో టీడీపీ జెండా ఎగిరింది. 1955, 1962, 1972, 1978, 1999, 2009 కాంగ్రెస్, 2019లో వైసీపీ గెలిచింది. నియోజకవర్గంలో ధర్మవరం పట్టణంతో పాటు ధర్మవరంరూరల్, బత్తలపల్లి, తాడిమర్రి, ముదిగుబ్బ మండలాలు ఉన్నాయి. పోలింగ్ కేంద్రాలు 290 ఉన్నాయి. 35 సెక్టార్లు, 35 రూట్స్ ఉన్నాయి. మొత్తం ఓటర్లు 2,45,758 మంది ఉండగా ఇందులో పురుషులు 1,21,764 మంది, మహిళలు 1,23,974 మంది, థర్డ్ జండర్ 20 మంది ఉన్నారు.

ఇసుక అక్రమ రవాణాలో రూ.వందల కోట్లు..!

ముదిగుబ్బ మండలం ఉప్పలపాడు రీచ్ నుంచి ఇసుకను తోడేసి బత్తలపల్లి నల్లబోయనపల్లి వద్ద డంపింగ్ చేస్తున్నారు. అక్కడి నుంచి పట్టపగలే కర్ణాటకకు తరలిస్తున్నారు. కర్ణాటకలో టిప్పర్ రూ.70వేలకు వరకు అమ్ముకుంటున్నారు. అదేవిధంగా నియోజకవర్గంలో రేషన్ బియ్యం, గుట్కా, మట్టి తదితర వాటిని కూడా ఎమ్మెల్యే అనుచరులు అక్రమంగా రవాణా చేసి కోట్లలో దండుకుంటున్నట్లు ప్రచారం జరుగుతోంది.

స్థలం కనిపిస్తే కబ్జాలే

నియోజకవర్గంలో అధికార పార్టీ నేతలు, అనుచరులు స్థలాలు కనిపిస్తే కబ్జాలు చేస్తారని ప్రజలు, ప్రతిపక్ష పార్టీల నాయకులు పేర్కొంటున్నారు. ఎమ్మెల్యే తుంపర్తి గ్రామ ఎస్సీలకు చెందిన 20 ఎకరాలు బెదిరించి తక్కువ ధరకు కొనుగోలు చేయడంతో పాటు అక్కడే మరికొన్ని భూములను తన కుటుంబసభ్యుల పేరిట నకిలీ పట్టాలు సృష్టించారన్న ఆరోపణలు ఉన్నాయి. ఎమ్మెల్యేతోపాటు నియోజకవర్గంలో ఆయన అనుచరులు కూడా ప్రభుత్వ భూములు, అసైన్డ్, డీకేటీ భూములను సైతం వదలడంలేదని, కబ్జాలు చేస్తున్నట్టు బహిరంగంగా చర్చించుకుంటున్నారు. గుడ్‌మార్నింగ్ పేరుతో వార్డు, గ్రామాల్లో సైతం ఖాళీ స్థలాలు కనిపిస్తే కబ్జాలు చేసేస్తున్నారని ప్రచారం సాగుతోంది.

సొంత పార్టీలో ఎమ్మెల్యేపై వ్యతిరేకత

స్థానిక ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డికి సొంత పార్టీలో వ్యతిరేకత ఉంది. ఇటీవల వైసీపీకి చెందిన బలమైన నేతలు ధర్మవరం పట్టణానికి చెందిన వైసీపీ చేనేత విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గిర్రాజు నగేశ్, బత్తలపల్లికి చెందిన కురుబ కార్పొరేషన్ ఛైర్మన్ కోటి సూర్యప్రకాశ్‌బాబు, ముదిగుబ్బ ఎంపీపీ ఆదినారాయణయాదవ్, చందారాఘవ తదితరులు బీజేపీలోకి చేరారు. దీంతో కూటమి బీజేపీ అభ్యర్థి గెలుపు సునాయాసమవుతుందని వారు ధీమాగా ఉన్నారు. దీనికి తోడు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా, టీడీపీ అధినేత చంద్రబాబు ధర్మవరం పర్యటన కూడా కూటమి అభ్యర్థికి కలిసి వస్తుందని అంచనా వేస్తున్నారు.

బీజేపీ అభ్యర్థి సత్యకుమార్‌యాదవ్ బలాలు

సత్యకుమార్‌యాదవ్ బీజేపీ జాతీయస్థాయి నాయకుడిగా ఉండటం.
కేంద్రంలోని పెద్దలతో సన్నిహిత సంబంధాలు ఉండటం.
ముఖ్యంగా నియోజకవర్గంలో బీసీ కార్డు బలంగా ప్రజల్లోకి వెళ్లడం.
వైసీపీ నుంచి బలమైన నేతలు బీజేపీలో చేరడం.
ఏదైన అనుకుంటే సాధించేవరకు పట్టువదలని విక్రమార్కుడు అన్న పేరు.

బలహీనతలు

ధర్మవరానికి ఎన్నికల ముందు రావడం.
ప్రజల్లో కొత్తవ్యక్తిగా ప్రచారం జరగడం.
ప్రత్యక్ష ఎన్నికల్లో మొదటిసారి పోటీ
నాన్‌లోకల్ అన్న అభిప్రాయం.

ఎమ్మెల్యే కేతిరెడ్డి బలాలు

జగన్ ప్రభుత్వం చేపట్టిన పథకాలు
స్థానికంగా అందుబాటులో నిత్యం ఉండటం
తనకంటూ ప్రత్యేక బలాన్ని చేకూర్చుకోవడం

బలహీనతలు

చేనేత క్లస్టర్‌ను ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చి అమలుచేయకపోవడం.
వైసీపీలో వ్యతిరేకత, బలమైన నేతలు పార్టీని వీడడం.
ప్రభుత్వ అసైన్డ్, డీకేటీ భూములు కబ్జాలు చేయడం.
ఎదిరించిన వారిపై దాడులు, అక్రమ కేసులు బనాయించడం.

అక్కడ చైతన్యం ఎక్కువ..?



రాళ్ల అనంతపురంలో పోలీసు కవాతు

కంబదూరు మండలంలోని ఆ గ్రామాలలో ప్రచారం చేసే సమయంలో ఏ పార్టీ అభ్యర్థులైనా ఆచితూచి అడుగులేస్తారు. సమస్యలపై ప్రశ్నించే చైతన్యం అక్కడి ప్రజల్లో ఉండటమే దీనికి కారణం. ఒకప్పటి మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలైన అచ్చంపల్లి, చెన్నంపల్లి, కురాకులపల్లి, అయ్యంపల్లి, రాళ్ల అనంతపురం, నర్సీపురం, రాళ్లపల్లి తదితర గ్రామాలలో సమస్యలపై రాజకీయ నాయకులను నిలదీసిన సంఘటనలు చాలా ఉన్నాయి. సమస్యలను పరిష్కరిస్తారా..? లేదా..? అని ఇక్కడి ప్రజలు సూటిగా ప్రశ్నిస్తారు. మాజీ ఎమ్మెల్యే శారదమ్మను రాళ్ల అనంతపురంలో మావోయిస్టులు అప్పట్లో ఓసారి నిర్బంధించారు. ఈ మండలంలో పలువురు నాయకులను అప్పట్లో మావోయిస్టులు ఎత్తుకువెళ్లి.. పద్ధతిగా ఉండాలని హెచ్చరించి పంపిన సంఘటనలు ఉన్నాయి. కురాకులపల్లిలో గత ఎన్నికల ప్రచార సమయంలో ఇరువర్గాల నిలదీతలు, ఫిర్యాదులు తారస్థాయికి చేరి.. రాళ్లదాడుల వరకూ వెళ్లాయి. ఇప్పుడు మావోయిస్టుల ప్రభావం లేకపోయినా.. ఆ చైతన్యపు వాసనలు మాత్రం పోలేదు. కొందరు మాజీ నక్సలైట్లు జనజీవన స్రవంతిలో కలిసిపోయారు. ప్రత్యక్ష రాజకీయాల్లో ఉన్నారు. వివిధ పార్టీల అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం చేస్తున్నారు. సున్నితమైన ఈ గ్రామాలపై పోలీసుల నిఘా కూడా ఎక్కువగా ఉంది.

\- కళ్యాణదుర్గం

ఎస్సీ, ఎస్టీ ఓటర్లకు రక్షణ

అనంతపురం అర్బన్: షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల (దౌర్జన్యాల నిరోధక) చట్టం మేరకు ఎస్సీ, ఎస్టీ, ఇతర బలహీన వర్గాల ప్రజలను ఎన్నికల్లో తాము చెప్పిన అభ్యర్థికి ఓటు వేయాలని, మరో వ్యక్తికి ఓటు వేయకూడదని లేదా ఆ వర్గాల వారు అభ్యర్థిగా నిలబడకూడదని బలవంతం చేసినా, బెదిరించినా, హెచ్చరించినా అలాంటి వ్యక్తులు శిక్షార్హులవుతారు. ఈ నేరాలకు 6 నుంచి 10 ఏళ్ల వరకు జైలు శిక్షతోపాటు జరిమానా విధిస్తారు. బలహీన వర్గాల ఓటర్లు ముఖ్యంగా ఎస్సీలు, ఎస్టీలు తదితర ఓటర్ల విశ్వాసాన్ని పెంపొందించేందుకు ఎన్నికల కమిషన్ ఈ నిర్ణయం తీసుకుంది.

గురువుల జేబుకు చిల్లు

జగన్ ప్రభుత్వ నిర్వాకంతో ఆర్థిక ఇబ్బందులు

పాఠశాలలకు ఎస్ఎంసీ నిధుల విడుదలలో మొండిచేయి

పైసా ఇవ్వకుండానే విద్యా సంవత్సరం ముగింపు

కళ్యాణదుర్గం: జగన్ ప్రభుత్వం చెత్త రికార్డుతో 2023-24 విద్యాసంవత్సరాన్ని ముగించింది. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా పాఠశాలల నిర్వహణకు ఒక విద్యా సంవత్సరం పైసా ఇవ్వకుండానే బడులకు సెలవులు ఇచ్చింది. పదిన్నర నెలల పాటు బడుల నిర్వహణకు గురువులే తమ జేబులోని డబ్బులు వెచ్చించాల్సి వచ్చింది. విద్యుత్ చార్జీల భారం మోయలేక వారు తిప్పలు పడాల్సి వచ్చింది. పాఠశాలల విద్యుత్ చార్జీల భారాన్ని ప్రభుత్వమే భరిస్తుందని పాఠశాల విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ఇచ్చిన హామీ నెరవేరలేదు. ఫలితంగా విద్యుత్ శాఖ నుంచి అందిన నోటీసులకు భయపడి విద్యుత్ బిల్లులను ప్రధానోపాధ్యాయులే చెల్లించారు. చివరకు సుద్దముక్కకు కూడా జగన్ ప్రభుత్వం పైసా ఇవ్వలేదు. తెల్లకాగితాలు, రికార్డు పుస్తకాలు, చీపుర్లు, ఇతర సామగ్రికి సైతం గురువులే సొంత డబ్బులు వెచ్చించాల్సి వచ్చింది. గత విద్యాసంవత్సరంలో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్ఎంసీ) గ్రాంట్ కింద ఇవ్వాల్సిన నిధులలో 50 శాతమే ఇచ్చారు. ప్రస్తుతం ముగిసిన విద్యాసంవత్సరంలో పైసా ఇవ్వలేదు. దీంతో ఆ డబ్బులు వస్తాయా లేదా అన్న అనుమానాన్ని గురువులు వ్యక్తం చేస్తున్నారు. కళ్యాణదుర్గం పట్టణంలోని ఓ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సొంత డబ్బులు రూ. 1.20 లక్షల వరకు వెచ్చించారు. కంబదూరు మండలంలోని ఓ పాఠశాలలో పని చేస్తున్న మరో హెచ్ఎం రూ. 10 వేలు సొంత డబ్బులు వెచ్చించి విద్యుత్ బకాయిలు చెల్లించారు. ఇక ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు రూ. 50 వేలు నుంచి రూ. 1.50 లక్షలు, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు రూ. 10 వేలు నుంచి రూ. 25 వేలు వరకు జేబుల్లో నుంచి ఖర్చుచేశారు. గత నెలలో విద్యుత్ బిల్లుల బకాయిలు చెల్లించకుంటే ఫ్యూజులు పీకేస్తామని విద్యుత్ శాఖ అధికారులు నోటీసులిచ్చారు. దీంతో విద్యుత్ లేకపోతే బడి నడవదని భావించి హెచ్ఎంలు వాటిని చెల్లించారు. బకాయిలు వుంటే జరిమానాలు ఎక్కువ పడుతున్నాయనే భయంతో ఎక్కువ మంది విద్యుత్ బిల్లులు చెల్లించి ఎస్ఎంసీ గ్రాంట్ల కోసం ఎదురుచూశారు. గత యేడాదికి సంబంధించి 45 పాఠశాలలకు రూ. 50 లక్షల వరకు బకాయిలు రావాల్సి వుంది. ప్రధానోపాధ్యాయులు జేబులు ఖాళీ చేసిన ప్రభుత్వాన్ని ఇప్పుడే చూస్తున్నామని ఉపాధ్యాయ సంఘాల నాయకులు మండిపడుతున్నారు.

హామీ మరిచిన మంత్రి

నాడు-నేడు కింద పాఠశాలల్లో అభివృద్ధి పనులు పూర్తి చేసిన తరువాత విద్యుత్ బిల్లులు మోయలేని విధంగా వున్నాయని ఉపాధ్యాయ సంఘాల నాయకులు గతేడాది జూలైలో మంత్రి బొత్స సత్యనారాయణ దృష్టికి తీసుకెళ్లారు. పాఠశాలల విద్యుత్ చార్జీలను ప్రభుత్వమే చెల్లిస్తుందని, మీరు బిల్లులు చెల్లించవద్దని హెచ్ఎంలకు మంత్రి హామీ ఇచ్చారు. ఆ మాటలు నమ్మి గతేడాది ఆగస్టు నుంచి పాఠశాలలు విద్యుత్ బకాయిలు చెల్లించలేదు. పాఠశాల నిర్వహణకు విద్యుత్ చార్జీల భారాన్ని రాష్ట్ర ప్రభుత్వమే చెల్లిస్తుందన్న ఉత్తర్వు ఇప్పటి వరకు జారీ చేయలేదు. దీంతో తమకు ఎలాంటి ఉత్తర్వు రాలేదని, బకాయిలు చెల్లించాల్సిందేనని విద్యుత్ శాఖ ప్రధానోపాధ్యాయులకు నోటీసులు ఇవ్వడంతో చేసేదేమీ లేక గత నెలలో ఎక్కువ మంది చెల్లించారు.



టీడీపీతోనే శాంతియుత పాలన

అనంతపురం ఎంపీ అభ్యర్థి అంబికా లక్ష్మీనారాయణ



విడపనకల్లులో మాట్లాడుతున్న అంబికా లక్ష్మీనారాయణ

గుంతకల్లు, మే 7: రాష్ట్రంలో పెరిగిపోయిన అరాచకాలు, దౌర్జన్యాలకు చరమగీతం పాడటానికి టీడీపీకి ఓటు వేసి అభ్యర్థులను గెలిపించాలని అనంతపురం కూటమి ఎంపీ అభ్యర్థి అంబికా లక్ష్మీనారాయణ ఓటర్లను కోరారు. మంగళవారం గుంతకల్లుకు వచ్చిన అంబికా పట్టణంలోని డీఆర్ఎం కార్యాలయం, డీజల్ షెడ్, రైల్వే ఎలక్ట్రికల్ కార్యాలయంలో ప్రచారం నిర్వహించారు. టీడీపీ తరఫున ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులుగా బరిలో నిలిచిన తనకు, గుమ్మనూరు జయరాంకు ఓట్లు వేసి గెలిపించాలంటూ అంబికా ప్రచారం చేశారు. అనంతరం మార్వాడీలు, ఆర్యవైశ్య ప్రముఖులతో భేటీ అయ్యి ఎన్నికల్లో తమకు మద్దతునివ్వాలని కోరారు. టీడీపీ ద్వారానే రాష్ట్రంలో శాంతియుత వాతావరణం నెలకొంటుందని, వ్యాపార వర్గాలు స్వేచ్ఛాయుతంగా కార్యకలాపాలు నిర్వహించుకోగలరని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పత్తి హిమబిందు, ముష్టూరు తిమ్మప్ప, పూల రమణ, గోవిందరాజులు, ముష్టూరు బాలాజీ సింగ్, క్రిష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండ : చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందని పార్లమెంట్ కూటమి అభ్యర్థి అంబికా లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. వజ్రకరూరు మండలంలోని చాయాపురం, వజ్రకరూరులో మంగళవారం ఆయన ప్రచారం నిర్వహించారు. రాష్ట్ర భవిష్యత్తు కోసమే కూటమి కలయిక అన్నారు. ప్రజలు విజ్ఞతతో ఆలోచించి ఓటు ద్వారా భావితరాల మార్పునకు నాంది పలకాలన్నారు. ఈ నెల 13వ తేదీతో రాష్ట్రానికి పట్టిన దరిద్రం వదిలిపోతుందన్నారు. దుర్మార్గపాలనను తరిమికొట్టేందుకు ఇక మిగిలింది నాలుగు రోజులే అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నాగభూషణం, దస్తగిరి, వలి, గురుమూర్తి, సర్పంచ్ మనోహర్, రఘు, నారాయణస్వామి పాల్గొన్నారు.

విడపనకల్లు: సీఎం జగన్ రాష్ట్ర ప్రజానికానికి ఈ ఐదేళ్ల కాలంలో నరకం ఏమిటి అనేది చూపించాడని అనంతపురం టీడీపీ ఎంపీ అభ్యర్థి అంబికా లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని విడపనకల్లు గ్రామంలో ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంబికా మాట్లాడుతూ ఉరవకొండ ఎమ్మెల్యే అభ్యర్థి పయ్యావుల కేశవ్‌కు, అనంతపురం పార్లమెంట్ అభ్యర్థి అయిన తనకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రామాంజనేయులు, హనుమంతు, బీడీ చిన్న మారయ్య, భీమలింగప్ప, జనార్ధననాయుడు, చంద్రశేఖర్, డి. దేవేంద్ర, విజయ్‌శెట్టి, తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎంఎస్‌తో ఓటర్ స్లిప్

అనంతపురంరూరల్: క్షేత్రస్థాయిలో చాలా మంది ఓటర్ స్లిప్పులు అందలేదంటూ గాబారపడుతుంటారు. ఈ ఇబ్బంది లేకుండా ఈసారి ఎన్నికల సంఘం ఎస్ఎంఎస్ ద్వారా ఓటర్ స్లిప్ సమాచారం ఇచ్చింది. మొబైల్ ఫోన్‌లో ఈసీఐ అనిటైప్ చేసి స్పేస్ ఇచ్చి ఓటర్ ఐడీ నెంబరు ఎంటర్ చేసిన తరువాత 1950కి మెసేజ్ పంపిస్తే చాలు. సదరు ఓటరు పోలింగ్ బూత్ నెంబరుతోపాటు ఆ బూత్ ఓటర్ జాబితా, ఓటర్ సీరియల్ నెంబరుతో కూడిన మెసేజ్ వస్తుంది. పదిహేను సెకెన్లలో సమాచారం ఫోన్‌కు ఎస్ఎంఎస్ ద్వారా వస్తుంది.

మడకశిరను ఉద్యానహబ్‌గా తీర్చిదిద్దుతాం

- ప్రతి ఎకరాను సాగులోకి తీసుకువస్తాం
- వైసీపీ పాలనలో రాష్ట్రం అధోగతి
- టీడీపీతోనే అన్నివర్గాల సంక్షేమం, అభివృద్ధి
- హిందూపురం లోక్‌సభ టీడీపీ అభ్యర్థి బీకే పార్థసారథి



మడకశిర నియోజకవర్గంలో బీకే ప్రచారం

పుట్టపర్తి, మే 7(ఆంధ్రజ్యోతి): మడకశిరకు నేరుగా హంద్రీనీవా కాలువ ద్వారా ప్రతి చెరువును నింపి, ప్రతి ఎకరాను సాగులోకి తీసుకువస్తామని హిందూపురం లోక్‌సభ టీడీపీ కూటమి అభ్యర్థి బీకే పార్థసారథి హామీ ఇచ్చారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం మడకశిర నియోజక వర్గంలోని అగళి మండలంలో అసెంబ్లీ టీడీపీ కూటమి అభ్యర్థి ఎంఎస్‌రాజుతో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భగా బీకే మాట్లాడుతూ మడకశిర నియోజక వర్గంలో సారవంతమైన ఉద్యానవన పంటలకు సాగు అనుకూలమైన భూములు ఉన్నాయన్నారు. టీడీపీ హయాంలోనే మడకశిరకు గొల్లపల్లి నుంచి మడకశిర ఉప కాలువ ద్వారా హంద్రీనీవా నీరు ఇచ్చామన్నారు. చుట్టూ తిరిగివచ్చి మడకశిర ప్రాంతానికి నీరు చేరాలంటే ఆలస్యంతో చెరువుల్ని నింపలేని పరిస్థితి ఉందన్నారు. ఈ సమస్య లేకుండా తురకాపట్నం నుంచి నేరుగా మడకశిరకు కాలువ తవ్వి నీరిస్తామని హామీ ఇచ్చారు. నీరు వస్తే ఉమ్మడి జిల్లాలోనే వ్యవసాయం, పారిశ్రామిక రంగాల్లో మడకశిర ఆదర్శంగా నిలుస్తుందన్నారు. ఈ కల సాకారం కావాలంటే రాష్ట్రంలో టీడీపీ కూటమి కేంద్రంలో ఎన్‌డీఏ కూటమి అధికారంలో వస్తేనే సాధ్యమవుతుందన్నారు. అధికారంలోకి వచ్చాక ఏడాదిన్నరలోగా మడకశిరకు నేరుగా కాలువ నిర్మాణం చేపట్టి నీరు ఇస్తామని హామీ ఇచ్చారు. మడకశిర పల్లెల్లో బీకే ప్రచారానికి ప్రజలు బ్రహ్మరథం పట్టారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి శ్రేణులు పాల్గొన్నారు. అదే విధంగా పుట్టపర్తి నియోజక వర్గం తలమర్లలో పుట్టపర్తి టీడీపీ కూటమి అసెంబ్లీ అభ్యర్థి పల్లె సింధూరరెడ్డితో కలిసి బీకే రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా బీకే మాట్లాడుతూ ఐదేళ్లగా రాష్ట్రాన్ని అధోగతి పాలు చేసిన వైసీపీకి ప్రజలు ఓటు ద్వారా ఈ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. టీడీపీతోనే అన్ని వర్గాల సంక్షేమని, కూటమికి ఘన విజయం అందించాలని కోరారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

స్వామి చిన్మయానంద సరస్వతి (జయంతి)



హిందూ ఆధ్యాత్మికవేత్తగా చిన్మయ మిషన్‌ను స్థాపించి అద్వైత వేదాంతాన్ని, భగవద్గీతను, ఉపనిషత్తులను ప్రపంచ వ్యాప్తంగా విస్తరించేలా బోధనలు చేసిన స్వామి చిన్మయానంద సరస్వతి 1916 మే 8న కేరళ రాష్ట్రం ఎర్నాకులంలో జన్మించారు. అసలు పేరు బాలకృష్ణ మీనన్. పాత్రికేయుడిగా కెరీర్‌ను ప్రారంభించి 33వ యేట సన్యాసదీక్ష తీసుకున్నారు. విశ్వ హిందూ పరిషత్ సహసంస్థాపకుడు. 300కుపైగా సెంటర్లతో జాతీయ, అంతర్జాతీయంగా మిషన్ పని చేస్తోంది. విద్య, వైద్య, సమాజసేవకు మిషన్ కృషి చేస్తోంది. 1970లో చిన్మయ మిషన్ ఆసుపత్రిని బెంగళూరులో ఏర్పాటు చేశారు. 1993 ఆగస్టు 3న నిర్యాణం చెందారు.

గిరిజాదేవి (జయంతి)



'పద్మవిభూషణ్' గ్రహీత గిరిజాదేవి 1929 మే 8న వారణాసిలో జమీందారు కుటుంబంలో జన్మించారు. శాస్త్రీయ గీతాలాపనలో ప్రత్యేకించి బెనారస్ ఘరానాలో పేరొందారు. క్లాజికల్, లైట్‌క్లాజికల్‌లో రాణించి తుమ్రి సంప్రదాయానికి వన్నె తెచ్చారు. కోల్కత్తాలోని ఐటీసీ సంగీత్ రీసెర్చ్ అకాడమీలో ఫ్యాకల్టీ సభ్యురాలిగా కొనసాగారు. సంగీత నాటక అకాడమీ, మహాసంగీత్ సమ్మాన్ తదితర అవార్డులు పొందారు. 2017 అక్టోబరు 24న కన్నుమూశారు.

డేవిడ్ అట్టెన్‌బరో (పుట్టినరోజు)



ఇంగ్లిష్ బ్రాడ్ కాస్టర్‌గా, నేచురల్ హిస్టోరియన్‌గా పేరొందిన సర్ డేవిడ్ ఫెడరిక్ అట్టెన్‌బరో 1926 మే 8న జన్మించారు. ప్రత్యేకించి బీబీసీలో మేనేజర్‌గా, డైరెక్టర్‌గా వ్యవహరించారు. నేచరల్ హిస్టరీ యూనిట్‌లో 9 డాక్యుమెంటరీలు తీశారు. బ్లాక్ అండ్ వైట్, కలర్, హెచ్‌డీ, 3డీ, 4కేలలో బాఫ్టా అవార్డులు పొందిన ఏకైక వ్యక్తి. జీవవైవిధ్యంపై ప్రజలలో అవగాహన కల్పించి ప్రకృతిని కాపాడు కోవాలని ఆకాంక్షించేలా చైతన్యపరిచారు. 2022లో యునైటెడ్ నేషన్స్ ఎన్విరాన్‌మెంట్ ప్రోగ్రామ్ ఆయనను 'చాంపియన్ ఆఫ్ ది ఎర్త్'గా గుర్తించింది.

మాజీ ఎమ్మెల్యేకు సన్మానం



రాజణ్ణను సత్కరిస్తున్న అభిమానులు

శిడ్లఘట్ట మే 7: మాజీ ఎమ్మెల్యే ఎం రాజణ్ణను అభిమానులు, బీజేపీ కార్యకర్తలు ఆత్మీయంగా సత్కరించారు. జంగమకోటి స్వాభిమాని నేతృత్వంలో మాజీ ఎమ్మెల్యే రాజణ్ణ పుట్టినరోజును పురస్కరించుకుని పలువురు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రాజణ్ణను సంప్రదాయ మైసూరు తలపాగాతో సన్మానం చేశారు. ఎమ్మెల్యేగా ఆయన సాధనలను పలువురు ప్రస్తావించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు స్కూల్ దేవరాజు, తొట్టిలగనహళ్ళి స్వామి, నాగమంగల మంజునాథ, హోసపేట గ్రామపంచాయతీ మాజీ సభ్యుడు హెచ్‌పి నారాయణస్వామి, జిల్లా యువమోర్చా కార్యవర్గ సభ్యుడు అజిత్‌కుమార్, మేలూరు యవ నాయకుడు అనిల్‌కుమార్, నటరాజ్, గుడళ్ళి మంజు తదితరులు పాల్గొన్నారు.

రైలు కిందపడి యువకుడి ఆత్మహత్య



అనిల్‌కుమార్ (ఫైల్)

పెనుకొండ రూరల్, మే 7 : సొంత ఇల్లులేదనే మనస్తాపంతో అనిల్‌కుమార్ (35) అనే యువకుడు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే ఎస్‌ఐ బాలాజీ నాయక్ తెలిపారు. మండలపరిధిలోని వెంకటరెడ్డిపల్లికి చెందిన బలిజ వెంకటప్పకుమారుడు అనిల్ కుమార్ మినరల్ వాటర్‌తరలించే వాహన డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగించేవాడు. అతడు రెండేళ్ల కిందట శాలిని అనే యువతిని వివాహం చేసుకున్నాడు. పూరి గుడిసెలో నివసిస్తున్నాడు. సొంత ఇల్లులేదని మనస్తాపానికి గురై కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో అతడు మంగళవారం మండలంలోని రాంపురం సమీపంలో రైలుకిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. కీమెన్ అందించిన సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెనుకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య శాలిని, ఎనిమిది నెలల కుమార్తె ఉంది. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పెళ్లి కాలేదని మరో యువకుడు..

లేపాక్షి, మే 7 : వయసు పెరుగుతున్నా పెళ్లికాలేదనే మనస్తాపంతో మండలపరిధిలోని పులమతి గ్రామంలో ఓ యువకుడు మంగళవారం ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్‌ఐ గోపి తెలిపారు. పులమతి గ్రామానికి చెందిన లక్ష్మీనారాయణ(37)కు ఎన్ని సంబంధాలు చూసినా పెళ్లి కుదరలేదు. వయసు పెరుగుతున్నా పెళ్లికాకపోవడంతో మనస్తాపానికి గురై ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని మృతిచెందాడు. లక్ష్మీనారాయణ తండ్రి గంగాధరప్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఉరివేసుకుని మహిళ...

లేపాక్షి, మే 7 : మండలపరిధిలోని కంచిసముద్రం గ్రామంలో మంగళవారం ఓ మహిళ ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. కంచిసముద్రం గ్రామానికి చెందిన ఆదినారాయణమ్మ (42) తన ఇంటి పక్కనున్న పాడుబడిన పూరిగుడిసెలో ఉరివేసుకుని మృతిచెందింది. ఇది గుర్తించిన గ్రామస్థులు సమాచారం ఇవ్వగా పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సంతానలేమి దంపతులకు తీపి కబురు

- ప్రభుత్వ ఆసుపత్రుల్లోనూ ఐవీఎఫ్ చికిత్సలు

బెంగళూరు, మే 7 (ఆంధ్రజ్యోతి): సిలికాన్ సిటీ బెంగళూరు ప్రజలకు వైద్య ఆరోగ్యశాఖ తీపికబురు ప్రకటించింది. సంతానలేమి దంపతులకు ప్రభుత్వ ఆసుపత్రులలోనే ఐవీఎఫ్ చికిత్సలు పరిచయం చేసేందుకు వైద్యశాఖ సిద్ధమైంది. ఇటీవలికాలంలో దంపతులకు పలు కారణాలతో సంతానం కావడం లేదు. అందుకు ఆలస్యంగా వివాహాలు చేసుకోవడం, ఆర్థిక వ్యవహారాలతో ఒత్తిళ్లు, భార్యాభర్తలు ఉద్యోగాలు చేస్తుండడం ద్వారా వచ్చే వత్తిళ్ల వంటి కారణాలతో ఎక్కువమంది దంపతులకు పిల్లలు కలగడం లేదు. పిల్లలు లేరనే కారణంతో దత్తతకు తంటాలు పడుతున్నారు. ఐవీఎఫ్ చికిత్సలకు వెళ్లాలంటే లక్షలాదిరూపాయలు ఖర్చు చేయాలని పేద, మధ్యతరగతి ప్రజలు వెనుకడుగు వేస్తున్నారు. ఎంతోమంది తల్లిదండ్రులు ఇలాంటి కష్టాలతో పిల్లలు లేకుండానే జీవనం సాగిస్తున్నారు. ఇటువంటి వారి కోసమే వైద్య ఆరోగ్యశాఖ ఐవీఎఫ్ చికిత్సలు అందించదలిచింది. తక్కువ ఫీజుతోనే ఐవీఎఫ్ చికిత్సకు అవసరమైన వైద్యసేవలు కొనసాగించదలిచారు. ప్రాథమికంగా కేసీ జనరల్ ఆసుపత్రిలో ఆరంభించదలిచారు. ఆ తర్వాత బెంగళూరులోని మరిన్ని ఆసుపత్రులకు విస్తరింపచేయదలిచారు. ప్రభుత్వ నిర్ణయం అమలైతే సంతానలేమి దంపతులకు ఎంతో ఊరట లభించనుంది.

బెంగళూరు వాతావరణం చెడింది

- ముంబై లేదా పూనె వెళ్లాలా... భారత్ వీడాలా
- పారిశ్రామికవేత్త అనంత్ 'ఎక్స్'లో పోస్ట్

బెంగళూరు, మే 7 (ఆంధ్రజ్యోతి): వాతావరణంలో భారీ మార్పులు, అభివృద్ధి లేకపోవడంతో నగరంలో జీవనం ఇబ్బందికరం అవుతోంది. ఇది బెంగళూరుకే పరిమితం కాలేదు. పలు మహానగరాలలో ఇటువంటి సమస్యలు ఉన్నాయి. ఇటీవల బెంగళూరులో నీటి కొరతతోపాటు ట్రాఫిక్‌తోపాటు పలు సమస్యలపై సోషల్‌మీడియాలో తీవ్రమైన చర్చలు సాగుతుంటాయి. ప్రస్తుతం పారిశ్రామికవేత్త అనంత్‌శర్మ 'ఎక్స్'లో చేసిన పోస్టింగ్ వైరల్ అవుతోంది. అనంత్‌శర్మ బెంగళూరుకు చెందిన ఓ కంపెనీ కో ఫౌండర్. బెంగళూరు నగరంలో మౌలిక సదుపాయాలు, వాతావరణం, నీటి పరిస్థితిపై తీవ్రంగా విమర్శించారు. భారత్‌ను వీడాలా అనే ప్రశ్నను పోస్ట్‌లో ప్రస్తావించారు. అంతేకాదు ముంబై లేదా పూనెకు వెళ్లడం యోగ్యమైనదేనా..? అంటూ అడిగారు. బెంగళూరు మరో ఐదేళ్లలో మరింత చెడు వాతావరణం, కాలుష్యం పెరగనుందని, నీరు లేకుండా జీవనం కూడా కష్టమవుతుందన్నారు. ముంబై లేదా పూనెకు మారాలా..? లేదా భారత్‌నే వీడాలా అంటూ పోస్ట్ చేశారు. అనంత్‌శర్మ మే 3న మధ్యాహ్నం ఎక్స్‌లో పోస్ట్ చేయగా 3.76లక్షలమంది వీక్షించారు. 500మందికిపైగా కామెంట్‌లు చేయగా 110మంది రీ ట్వీట్ చేశారు. మౌలికసదుపాయాల సమస్యలపై ఆయన ప్రశ్నలు ఆలోచింపచేసేలా ఉన్నాయి. బెంగళూరుకు చెందిన పారిశ్రామికవేత్త సృజన్ ఆర్ శెట్టి స్పందిస్తూ కేవలం వాతావరణం చూసి బెంగళూరుకు రావడం లేదని, ఇక్కడి ప్రజలు మానవతాహృదయులని, అందరూ గెలవాలని భావిస్తారని యువత ఎటువంటి ఆలోచన లేకుండా వ్యాఖ్యలు చేస్తారని, ఇటువంటి మనఃస్థితి నుంచి బయటపడాలని తిప్పికొట్టారు. ఈ అంశంపై పలు రీట్వీట్‌లలో తీవ్రమైన చర్చలు సాగాయి.

ఐసీఎస్ఈ ఫలితాల్లో సెయింట్ ఫిలోమినా సత్తా



80శతానికి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు

బెంగళూరు, మే 7 (ఆంధ్రజ్యోతి): ఐసీఎస్ఈ పదో తరగతి ఫలితాల్లో జ్ఞానభారతి సమీపాన మరియప్పనపాళ్యలోని సెయింట్ ఫిలోమినా మెమోరియల్ స్కూల్ వందశాతం ఉత్తీర్ణత సాధించినట్టు పాఠశాల కార్యదర్శి రంగస్వామి వెల్లడించారు. నగరంలో మంగళవారం ఈమేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. జాస్విన్ షాన్ లోబో (96.80), దిశ ఎన్ భూషణ్ (91.40), పవన్ జే (87.20), శశాంక్ యాదవ్ పి (87.20), చందన పవర్ (85.40), పూజిత్ ఎ.బి. (81), పునీత్ కుమార్ వై (81)శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. 90మందికిగా 18మంది డిస్టింక్షన్, 27మంది ఫస్ట్‌క్లాస్‌లోనూ, 20మంది సెకండ్‌క్లాస్, 25మంది సాధారణంగా ఉత్తీర్ణత అయినట్టు తెలిపారు. ఇలా మొత్తం వందశాతం ఉత్తీర్ణత సాధించడం సంతోషంగా ఉందన్నారు. విద్యార్థులందరినీ ప్రత్యేకంగా అభినందించారు.

అల్లూరి సీతారామరాజుకు ఘన నివాళి



అల్లూరి సీతారామరాజుకు నివాళులు అర్పిస్తున్న సమితి పదాధికారులు

బెంగళూరు, మే 7 (ఆంధ్రజ్యోతి): మన్యం వీరుడు, విప్లవజ్యోతి అల్లూరి సీతారామరాజు శతవర్ధంతి సందర్భంగా ఘన నివాళులు అర్పించారు. తెలుగు విజ్ఞాన సమితి ఆధ్వర్యంలో మంగళవారం ప్రత్యేక కార్యక్రమం జరిపారు. అల్లూరి సీతారామరాజు తాను నమ్మిన సిద్ధాంతాల కోసం ప్రాణాలను తృణప్రాయంగా భావించారని 1924 మే 7న బ్రిటీష్ వారి తూటాలకు బలయ్యారని అధ్యక్షులు రాధాకృష్ణరాజు పేర్కొన్నారు. అల్లూరి శతజయంతి సందర్భంగా భీమవరంలో ఆయన విగ్రహం ఏర్పాటుతో భవిష్యత్తు తరాలను ఆలోచింపచేసిందన్నారు. ఢిల్లీలో ఓ రోడ్డుకు అల్లూరి పేరు పెట్టాలని డిమాండ్ చేశారు. సమితి ఉపాధ్యక్షుడు గంగరాజు, ప్రధాన కార్యదర్శి ఇడమకంటి లక్ష్మిరెడ్డి, కోశాధికారి వరదరాజు, కార్యవర్గ సభ్యులు జయచంద్రారెడ్డి, కృష్ణయ్యనాయుడు, వెంకటేశులు తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు సమితి మాజీ అధ్యక్షులు జేఎస్ రెడ్డికి శ్రద్ధాంజలి ఘటించారు.

గుంతలో ఇరుక్కున్న ట్రక్కు



ఇరుక్కున్న ట్రక్ ఇదే...

దొమ్మసంద్ర, మే 7: జిగణి నుంచి కేఆర్‌పురం వైపు టైల్ల లోడుతో వెళ్తున్న ట్రక్ ఒకటి రోడ్డుపై వర్షపునీటి గుంతలో చిక్కుకుంది. సోమవారం రాత్రి కురిసిన వర్షంతో రోడ్డుపక్కన గుంతలో నీరు చేరింది. దొమ్మసంద్ర సర్కిల్ సమీపాన కేబుల్ వైర్ల కోసం గుంతను తవ్వారు. గమనించని డ్రైవర్ సునిల్ అలాగే వెళ్లడంతో ట్రక్ గుంతలో చిక్కుకుని ఇరుక్కుంది. భారీ లోడ్ ఉండడంతో తొలగించేందుకు సాధ్యం కాలేదు. సోమవారం రాత్రి నుంచి మంగళవారం సాయంత్రం దాకా పరిస్థితి ఇలాగే ఉంది. తరచూ ఇక్కడ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని స్థానికులు పేర్కొంటున్నా రోడ్డును విస్తరింపచేయడంలో అధికారులు విఫలమయ్యారనే విమర్శలు ఉన్నాయి.

మలివిడత పోలింగ్ దృశ్యాలు



ఖానాపురలో ఓటు వేసి సెల్ఫీ పాయింట్‌లో కాంగ్రెస్ అభ్యర్థి అంజలి నింబాల్కర్



దావణగెరె కాంగ్రెస్ అభ్యర్థి ప్రభా, మంత్రి మల్లికార్జున్



బెళగావి కాంగ్రెస్ అభ్యర్థి మృణాల్ హెబ్బాళ్కర్



దారవాడ కాంగ్రెస్ అభ్యర్థి వినోద్ అసోటి



కొప్పళ తాలూకా గుడ్లనూరులో ఓటు వేసిన మంగళముఖి



క్యూలో వేచియున్న అభ్యర్థి ప్రియాంక



వీఆర్‌ఎల్ గ్రూప్ సంస్థ చైర్మన్ సంకేశ్వర్



విజయపురలో ఓటు వేసిన ఎమ్మెల్యే యత్నాళ్



కొప్పళ జిల్లా కారటగిలో మంత్రి శివరాజ్ తంగడగి



హోటల్ వద్ద ఓటు వేసిన వారికి ఉచిత టిఫిన్



విషాదంలోనూ ఓటు వేసేందుకు వచ్చిన కుటుంబీకులు

భక్తిశ్రద్ధలతో కరగ ఉత్సవం



పురవీధుల్లో కరగ ఊరేగింపు

బంగారపేట, మే 7: తాలూకాలోని నరసాపుర గ్రామంలో ధర్మరాయస్వామి ద్రౌపదమ్మ కరగ ఉత్సవం సోమవారం రాత్రి ఘనంగా జరిగింది. ఆలయ అభివృద్ధి ట్రస్టు, తిగళ యువజన క్షేమాభివృద్ధి సంఘం సంయుక్తంగా కార్యక్రమాన్ని నిర్వహించాయి. 93వ వార్షిక ఉత్సవాల్లో భాగంగా కరగ ఉత్సవం వైభవంగా సాగింది. కోలారు ఎమ్మెల్యే కొత్తూరు జీ మంజునాథ్ ఉత్సవాన్ని లాంఛనంగా ప్రారంభించారు. నరసాపుర గ్రామంలో రాత్రి 9 గంటలకు కరగను పూజారి కుప్పం బాలాజి ధరించారు. ఆలయం నుంచి నృత్యం చేస్తూ సాగారు. కరగ ఊరేగింపు సాగే ప్రాంతాలను స్వచ్ఛ పరిచి రంగవల్లులు వేశారు. పలు కూడళ్లలో కరగకు పూజలు చేశారు. మహిళలు దీపారాధన చేయగా అగ్నిగుండ ప్రవేశం కూడా నిర్వహించారు. ఉత్సవంలో ఎమ్మెల్సీ అనిల్ కుమార్, ఎల్‌జీ ఫౌండేషన్ సంస్థాపకుడు, అధ్యక్షుడు లక్ష్మణ్ గౌడ, మాలూరు సమాజసేవకుడు హూడి విజయ్‌కుమార్, గౌడ, వహ్నికుల సముదాయ వర్గం, తదితరులు పాల్గొన్నారు.

అక్క ఇంటికే చెల్లి కన్నం నగదు, నగల చోరీ..

బెంగళూరు, మే 7 (ఆంధ్రజ్యోతి): ఊరికి వెళ్లే ముందు తాళాలను ఇచ్చిన అక్క ఇంటికే సొంత చెల్లి గాలం వేసి ఏకంగా రూ.50లక్షలకుపైగా నగదు, 65లక్షల విలువైన బంగారు ఆభరణాలను చోరీ చేసిన సంఘటన బెంగళూరు కెంగేరి పోలీసులు ఛేదించారు. నాగదేవనహళ్ళి ఆర్ఆర్ లే అవుట్‌లోని ఓ ఇంట్లో నివసించేవారు. ఏప్రిల్ 22న ఫిర్యాదురారుడు కుటుంబంతో సొంతూరులో జరిగే పండుగకోసం వెళ్లారు. అదే రోజు రాత్రి నుంచి అక్క ఇంట్లో చెల్లి గడుపుతుంటారు. 24న రాత్రి 10.30గంటలకు అక్క ఇంట్లో నిద్రించేందుకు చెల్లి వెళ్లగా బీరువా తలుపులు తెరిచి ఉండడం, వస్తువులు చెల్లాచెదురుగా పడి ఉండడాన్ని చూసి అక్కకు ఫోన్‌లో సమాచారం ఇచ్చారు. అదేరోజు రాత్రి అక్క 12.30 గంటలకు ఇంటికి చేరుకుని పరిశీలించారు. 182 గ్రాముల బంగారం, నాణేలు, మంచంకింద దాచిన 52లక్షల నగదు చోరీ అయినట్టు గుర్తించి 25వ తేదీన పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టిన పోలీసులు ఫిర్యాదుదారుడి భార్య చెల్లి లగ్గెరెలో నివసిస్తూ ఆటో కన్సల్టెన్సీలో ఉద్యోగం చేస్తున్నారు. ఆమెను 27వతేదీ విచారణ జరపగా చోరీ విషయాన్ని అంగీకరిస్తారు. 46 బంగారు నాణేలు, 51లక్షల 90వేల రూపాయల నగదు స్వాధీనం చేసుకున్నట్టు డీసీపీ గిరీశ్ తెలిపారు.

24లీటర్ల అక్రమ మద్యం స్వాధీనం

చింతామణి, మే 7: తాలూకాలోని బిల్లాండ్లహళ్ళి గ్రామంలో నాలుగు రోజులక్రితం మద్యం మత్తులో ఒక వ్యక్తిపై దాడి ఘటనకు సంబంధించి గ్రామంలో అక్రమ మద్యం విక్రయాలే కారణమని గుర్తించారు. బట్లహళ్ళి పోలీసులు కార్యాచరణ నిర్వహించి చిల్లర దుకాణాన్ని తనిఖీ చేయగా 24 లీటర్ల అక్రమ మద్యాన్ని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. డీఎస్పీ మురళీధర్, కెంచార్లహళ్ళి సీఐ వెంకటరామ్ మార్గదర్శకంలో ఎస్సై పునీత్ నేతృత్వంలో దాడులు నిర్వహించారు. బైరారెడ్డికి చెందిన దుకాణంపై దాడి చేయగా 2 బీర్ బాటిళ్లు, 77 ఓటీ ప్యాకెట్‌లు, 78 హైవాట్స్ ప్యాకెట్‌లను స్వాధీనం చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

గంజాయి స్వాధీనం - ఇద్దరి అరెస్టు

బాగేపల్లి, మే 7: గంజాయిని తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. విశాఖపట్నం నుంచి చిక్కబళ్ళాపురకు గంజాయిని తరలిస్తున్నట్టు గుర్తించారు. చిక్కబళ్ళాపుర పట్టణం కందవారపేట నివాసి వేణుగోపాల్ (28), అందార్లహళ్ళి గ్రామ నివాసి అక్షయ్‌కుమార్ (27)లుగా గుర్తించారు. ట్రావెలింగ్ బ్యాగ్‌తో టోల్‌ప్లాజా వైపు నడిచి వస్తుండగా పోలీసులను చూసి పారిపోయేందుకు ప్రయత్నించారు. దీంతో పోలీసులు వారిని వెంబడించి అదుపులోకి తీసుకున్నారు. బ్యాగులో 20కేజీల 250 గ్రాముల గంజాయిని గుర్తించారు. బాగేపల్లి పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు



అంకోలా తాలూకా కూర్వ ద్వీపం నుంచి ఓటు వేసి పడవలో వెళ్తున్న ఓటర్లు









ఓటేసేందుకు క్యూలో వేచివున్న శెట్టర్ కుటుంబికులు, చిత్తాపురలో మంత్రి ప్రియాంక ఖర్గే, కాంగ్రెస్ అభ్యర్థి రాధాకృష్ణ దొడ్డమని, శిగ్గావిలో మాజీ సీఎం బొమ్మై కుటుంబం

ఓటేసిన అనంతరం కార్యకర్తలతో కేంద్రమంత్రి జోషి...

మలి విడత పోలింగ్ ప్రశాంతం

- 14 లోక్‌సభ స్థానాలకు ఎన్నికలు..
- మండే ఎండలోనూ పెరిగిన పోలింగ్ శాతం
- విదేశాల నుంచి పలువురి రాక



బాగల్కోటెలో ఓటు వేసిన ఎంబీ పాటిల్



బీదర్‌లో కాంగ్రెస్ అభ్యర్థి సాగర్‌ఖండ్రె



లంబాడి తండాలో పోలింగ్ కేంద్రం వద్ద సందడి



సఖి పోలింగ్ కేంద్రంలో ఓటేసిన మహిళలు



కాషాయ కండువాలతో ఓటుకు వచ్చిన యువత



వృద్ధురాలికి చేయూత



కాంగ్రెస్ అభ్యర్థి ప్రియాంక జార్కిహోళి

బెంగళూరు, మే 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రెండో విడత లోక్‌సభ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఉత్తర కర్ణాటక ప్రాంతంలోని చిక్కోడి, బెళగావి, బాగల్కోటె, బిజాపూర్ (విజయపుర), కలబురగి, రాయచూరు, బీదర్, కొప్పళ, బళ్ళారి, హావేరి, ధారవాడ, ఉత్తరకన్నడ, దావణగెరె, శివమొగ్గ నియోజకవర్గాల్లో పోలింగ్ మంగళవారం జరిగింది. 227మంది అభ్యర్థులు బరిలో ఉండగా 2.59 కోట్లమంది ఓటు హక్కు వినియోగించుకోవాల్సి ఉండేది. రాష్ట్రంలో తొలి విడతగా బెంగళూరు, మైసూరు, తీర ప్రాంత, మలెనాడు, బయలుసీమ ప్రాంతాల్లో ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. రెండో విడతలోనూ ఎక్కడా అల్లర్లు జరగకుండా ప్రశాంతంగా ముగిసినట్లు అధికారులు ప్రకటించారు. బెళగావి జిల్లాలో రెండు లోక్‌సభ స్థానాలు ఉండగా మిగిలిన జిల్లాల్లో ఒక్కొక్క నియోజకవర్గం మాత్రమే ఉంది. మలివిడత ఎన్నికల్లో అతిరథులు బరిలో ఉన్నారు. మాజీ సీఎంలు జగదీశ్ శెట్టర్, బసవరాజ్ బొమ్మైలు పోటీ చేస్తున్నారు. బీజేపీ నేత యడియూరప్ప కుమారుడు రాఘవేంద్ర శివమొగ్గ నుంచి పోటీ చేస్తుండగా కుటుంబ సభ్యులంతా కలసి ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, భార్య రాధాబాయితో కలసి కలబురగి నగరం బ్రహ్మపుర లే అవుట్‌లో ఓటు వేశారు. హావేరి అభ్యర్థి బసవరాజ్ బొమ్మై శిగ్గావిలో భార్య చెన్నమ్మ, కుమారుడు భరత్, కుమార్తె అదితిలతో కలసి ఓటు హక్కు వినియోగించుకున్నారు. బీజేపీ ఫైర్‌బ్రాండ్ బసనగౌడ పాటిల్ యత్నాళ్ విజయపురలో కుటుంబ సభ్యులతో కలసి ఓటు వేశారు. విజయనగర జిల్లా కూడ్లిగిలో రెండు చేతులు లేని దివ్యాంగురాలు కాలితో ఓటు వేశారు. కేంద్ర మంత్రి ప్రహ్లాద్‌జోషి హుబ్బళ్ళిలో ఓటు హక్కు వినియోగించుకున్నారు. బెళగావిలో కాంగ్రెస్ అభ్యర్థి మృణాల్ హెబ్బాళ్కర్, తల్లి మంత్రి లక్ష్మి హెబ్బాళ్కర్, మామ ఎమ్మెల్సీ చెన్నరాజ హట్టిహొళితో కలసి ఓటు వేశారు. పరిషత్ సభాపతి బసవరాజ్ హొరట్టి కుటుంబ సభ్యులతో కలసి ఓటు వేశారు. అంకోలా తాలూకా కూర్వ ద్వీపంనుంచి ఓటు వేసి పడవలో వచ్చి ఓటు హక్కు వినియోగించుకున్నారు. దావణగెరెలో మంత్రి మల్లికార్జున, అభ్యర్థి ప్రభా మల్లికార్జున కుటుంబ సభ్యులతో కలసి ఓటు వేశారు. నాలుగేళ్ల తర్వాత ధారవాడకు వచ్చి ఎమ్మెల్యే వినయ్ కులకర్ణి కుటుంబ సభ్యులతోపాటు ఓటు వేశారు. దావణగెరెలో పోలింగ్ కేంద్రం వద్ద కొంతమంది కాషాయ కండువాలు వేసుకుని తిరుగుతుండడంతో ఎస్పీ ఉమాశంకర్ వెంటనే ఇక్కడనుంచి దూరం వెళ్లాలని హెచ్చరించారు. పోలింగ్ కేంద్రానికి 200మీటర్ల సమీపంలోకి వస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. హుబ్బళ్ళిలో ఒకే కుటుంబానికి 96మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. కుటుంబంలోని కంటెప్ప కొప్పద, సహదేవప్ప కొప్పద, ఫకీరప్పకొప్పదలతోపాటు 96మంది ఓటు వేశారు. వీరంతా ఒకే కుటుంబానికి చెందిన వారుగా ప్రకటించారు. ఆస్ట్రేలియా నుంచి వచ్చి హావేరి నగరానికి చెందిన భావనా శివానంద ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈమె 12ఏళ్లుగా విదేశాల్లోనే గడుపుతూ వచ్చారు. ఓటు హక్కు వినియోగించుకునేందుకే ఇండియా వచ్చినట్లు తెలిపారు. ఈ సారి పలువురు ఎన్‌ఆర్‌ఐలు విదేశాల నుంచి వచ్చి ఓటెయ్యడం విశేషం. సాయంత్రం 5 గంటల దాకా జరిగిన పోలింగ్ వివరాలను పరిశీలిస్తే చిక్కోడి 72.75, బెళగావి 65.67, బాగల్కోటె 65.55, బిజాపూర్ 65.95, గుల్బర్గా 57.20, రాయచూరు 59.48, బీదర్ 60.17, కొప్పళ, 66.05, బళ్ళారి 68.94, హావేరి 71.90, ధారవాడ, 67.15, ఉత్తరకన్నడ 69.57, దావణగెరె 70.90, శివమొగ్గ 72.07శాతం పోలైంది. 5గంటలకు సగటున పోలింగ్ 66.05గా నమోదైంది. తుది పోలింగ్ వివరాలు అందాల్సి ఉంది.



దావణగెరెలో బీజేపీ అభ్యర్థి గాయత్రి సిద్దేశ్వర్



ఓటు వేసిన బాలింత



ఆస్ట్రేలియా దేశం సిడ్నీ నుంచి వచ్చి హావేరిలో ఓటు వేసిన మహిళ



ఔరాద్‌లో ఓటు వేసిన భగవంత్ ఖూబా



సభాపతి బసవరాజ్ హొరట్టి

ఓటు హక్కు వినియోగించుకున్న ఒకే కుటుంబంలోని 96మంది

- పోలింగ్‌ను పండుగలా జరుపుకున్న అవిభక్త కుటుంబం

బళ్లారి గాంధీనగర్, మే 7: ఓటు ప్రాధాన్యం ఎరిగిన ఓ ఉమ్మడి కుటుంబంలోని 96మంది సభ్యులు మంగళవారం లోక్‌సభ ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకుని అందరి దృష్టి ని ఆకర్షించారు. హంపీ తాలూకా నొల్వి గ్రామం లో ఒకే కుటుంబానికి చెందిన 96మంది సభ్యులు తమ ఓటు హక్కును వినియోగించుకుని ఇతరులకు ఆదర్శంగా నిలిచారు. తాలూకాలో నూల్వి గ్రామంలో కంటిప్ప తోట ప్రాంతంలో నివసిస్తున్న వీరు స్థానిక ప్రభుత్వ కన్నడ బాలికల పాఠశాల పోలింగ్ కేంద్రం 56, 57లో ఓటు వేశారు. సెల్ఫీ తీసుకుని హర్షం వ్యక్తం చేశారు.



సెల్ఫీ తీసుకుంటున్న ఉమ్మడి కుటుంబ సభ్యులు



ఓటు వేసిన ఉమేశ్‌జాధవ్



మంత్రి ఈశ్వర్‌ఖండ్రె

మీడియాతో మాట్లాడుతున్న జేడీఎస్ నేత కుమారస్వామి



- పెన్ డ్రైవ్ బహిర్గతంలో ఆయన పేరే కీలకంగా వినిపిస్తోంది..
- డీకేను కేబినెట్ నుంచి తొలగించాలి
- విచారణను సిట్ నుంచి సీబీఐకి అప్పగించాలి
- మాజీ సీఎం కుమారస్వామి డిమాండ్

సూత్రధారి డీకే శివకుమార్..!

బెంగళూరు, మే 7 (ఆంధ్రజ్యోతి): ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ రాసలీలల పెన్‌డ్రైవ్ వివాదంలో డీసీఎం డీకే శివకుమార్ పేరు ప్రధానంగా వినిపిస్తున్నందున వెంటనే కేబినెట్‌నుంచి తొలగించాలని జేడీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కుమారస్వామి డిమాండ్ చేశారు. మంగళవారం బెంగళూరు జేడీఎస్ కార్యాలయంలో అత్యవసర ప్రెస్‌కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రజ్వల్ రేవణ్ణ వివాదం నిష్పక్షపాతంగా దర్యాప్తు జరగాలంటే సీబీఐకి అప్పగించాలన్నారు. సిట్ విచారణపై నమ్మకం లేదన్నారు. సిట్ అధికారులు డీసీఎం డీకే శివకుమార్, కొందరు కాంగ్రెస్ నేతల చేతిలో బొమ్మలుగా మారారన్నారు. డీకే శివకుమార్ పేరు పెన్‌డ్రైవ్ వివాదంలో పదే పదే ప్రస్తావన వస్తోందన్నారు. విజయపుర ఎమ్మెల్యే బసవనగౌడ పాటిల్ యత్నాళ్, గోకాక్ ఎమ్మెల్యే రమేశ్ జార్కిహొళిలు ఆయనపైనే ఆరోపణలు చేశారన్నారు. వీటన్నింటి దృష్ట్యా కేసును సీబీఐ ద్వారా దర్యాప్తు జరిపించాలన్నారు.

- జేడీఎస్ కార్యకర్తలు పెద్దఎత్తున జేడీఎస్ పార్టీ ప్రాంగణంలో నిరసన తెలిపారు. డీసీఎం డీకే శివకుమార్‌ను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. కాగా బీజేపీ ఎమ్మెల్యే బసనగౌడ పాటిల్ యత్నాళ్ పెన్‌డ్రైవ్ వివాదంలో సిట్ దర్యాప్తుతో న్యాయం జరగదన్నారు. సీబీఐ ద్వారా అయితేనే వాస్తవాలు వెలుగులోకి వస్తాయన్నారు. విజయపురలో ఆయన మీడియాతో మాట్లాడుతూ హాసన్ జిల్లా అడ్వకేట్ దేవరాజేగౌడ పెన్‌డ్రైవ్ లీకేజీపై స్పష్టత ఇచ్చారని ఇక్కడి సిట్ అధికారులు డీకే శివకుమార్ కంట్రోల్‌లో ఉన్నారన్నారు. రాష్ట్రంలో రెండి సీడీ ఫ్యాక్టరీలు ఉన్నట్లయ్యిందని, ఒకటి ఓపెన్ కాగా మరొకటి ఎప్పుడైనా ఓపెన్ కావచ్చునన్నారు. గోకాక్ బీజేపీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి రమేశ్ జార్కిహొళి గోకాక్‌లో మీడియాతో మాట్లాడుతూ తనకు సంబంధించిన వీడియోలు బయటకు వచ్చినప్పుడు అందరూ నవ్వారని, ప్రస్తుతం ప్రజ్వల్ పెన్‌డ్రైవ్‌లు బయటకు రావడంతో సూత్రధారి ఎవరో బయటకు తెలుస్తోందన్నారు. ప్రజ్వల్ కేసు ఎవరూ గర్వంగా భావించేది కాదని, అయితే సమాజానికి ఏం సందేశం ఇచ్చినట్లు అన్నారు. ప్రజ్వల్ రేవణ్ణ కేసులో డీకే శివకుమార్ ఆడియో విడుదలపై ఆయన తీవ్రంగా స్పందించారు. ఆ మహా నాయకుడు ఎంతటికైనా సిద్ధమన్నారు. రానున్న రోజుల్లో సీఎం సిద్దరామయ్య, హోం మంత్రి పరమేశ్వర్‌ల సీడీ లు కూడా బయటకు రావచ్చన్నారు.
- డీసీఎం డీకే శివకుమార్‌పై బెంగళూరు వ్యాప్తంగా పోస్టర్‌లు వెలిశాయి. రాజకీయాలకోసం దిగజారుతారని, ఆడబిడ్డల ఫొటోలను ఉపయోగించి రాజకీయం చేస్తున్న లులు కుమార అంటూ పోస్టర్‌లు వేశారు. బసవేశ్వరనగర, రాజాజీనగర్, సదాశివనగర్ తోపాటు పలు చోట్ల పోస్టర్‌లు వెలిశాయి. మీడియా సమావేశంలో ఎమ్మెల్సీ శరవణ తదితరులు పాల్గొన్నారు.

సిట్ విచారణలో జోక్యం లేదు : సీఎం

సిట్ అధికారులు సమగ్రంగా దర్యాప్తు చేస్తున్నారని, విచారణలో ప్రభుత్వ జోక్యం ఉండదని సీఎం సిద్దరామయ్య స్పష్టం చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రభుత్వం తప్పు చేసినవారికి తగిన శిక్ష వేసేందుకు చొరవ చూపుతుందన్నారు. సిట్‌లో సమర్థులైన అధికారులు ఉన్నారన్నారు.

బెంగళూరు నుంచి ముంబైకి ఆరు లేన్ల రహదారి

బెంగళూరు, మే 7 (ఆంధ్రజ్యోతి): ఐటీ నగరి బెంగళూరు నుంచి ఆర్థికనగరి ముంబై మధ్య 6లేన్ల రహదారి నిర్మించనున్నట్లు కేంద్ర భూ ఉపరితల రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ సమాచారం ఇచ్చారు. చిత్రదుర్గ నుంచి దావణగెరె మధ్య 6 లేన్ల రోడ్డును వేగవంతంగా నిర్మించదలచినట్లు ప్రకటించారు. ఆ తర్వాత బెంగళూరు-ముంబై మధ్య ప్రయాణీకులకు ఇది సులభతరం కానుందని సంతోషం వ్యక్తం చేశారు. ఇటీవల మౌలిక సదుపాయాల అభివృద్ధి విషయమై రోడ్డుకు సంబంధించిన పలు చిత్రాలను గడ్కరీ పోస్ట్ చేశారు. బెంగళూరు - ముంబైల మధ్య జీవనాడిగా ఉండే చిత్రదుర్గ - దావణగెరెల మధ్య ప్రాంతాలను పరిశీలించారు. ఈ మార్గం సమయం ఆదానే కాదు, ఇంధన సామర్థ్యంతోపాటు కర్ణాటకను సందర్శించేవారికి మరింత తోడ్పడనుందని పోస్ట్ చేశారు. రెండు మెట్రో నగరాల మధ్య ప్రయాణ సమయాన్ని తగ్గించడమే కాక, పర్యావరణ స్నేహి ప్రాజెక్టుగా ఉంటుందని దీనికి రూ.1400 కోట్లు ఖర్చు కానుందని తెలిపారు.



కృష్ణాష్టమి నాటికి రాధాకృష్ణుల విగ్రహం

- శిల్పి అరుణ్ యోగిరాజ్

మహదేవపుర, మే 7: రానున్న కృష్ణాష్టమి నాటికి హొయ్సళ, మైసూరు శైలిలో రాధాకృష్ణ విగ్రహాన్ని సిద్ధం చేయనున్నట్లు అయోధ్య బాలరాముడి విగ్రహ రూపకర్త, మైసూరుకు చెందిన ప్రముఖ శిల్పి అరుణ్ యోగిరాజ్ వెల్లడించారు. వైట్‌ఫీల్డ్‌లోని ఈఎల్‌వీ ప్రాజెక్ట్ గ్రూప్ సంస్థలు నిర్మిస్తున్న రాధాకృష్ణ ఆలయాన్నితి ఆయన మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా అరుణ్ యోగిరాజ్ మాట్లాడుతూ రాధాకృష్ణ విగ్రహ నిర్మాణ బాధ్యతను సంస్థ ముఖ్యులు భాస్కర్ తనకు అప్పగించడం హర్షణీయమన్నారు. ఆలయ గర్భగుడి తలుపుల నిర్మాణ కొలతలకోసం వచ్చానన్నారు. అయోధ్య రామ్‌లల్లా విగ్రహ ప్రతిష్ఠాపన అనంతరం బిజీగా ఉన్నానన్నారు. పలుమార్లు ఈఎల్‌వీ ప్రాజెక్టు బృందం తనను సంప్రదించారన్నారు. వచ్చే శ్రీకృష్ణ జన్మాష్టమి నాటికి విగ్రహాన్ని రూపొందించన్నుట్లు తెలిపారు. ఈఎల్‌వీ ప్రాజెక్టు గ్రూప్ సంస్థల భాస్కర్ మాట్లాడుతూ రాధాకృష్ణ విగ్రహ తయారీకి ప్రముఖ శిల్పి అరుణ్ యోగిరాజ్ అంగీకరించడం సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా స్థానికులు ఎల్ రాజేశ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



నిర్మాణదశలోని ఆలయం వద్ద అరుణ్ యోగిరాజ్ తదితరులు